www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



15 నుంచి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - రామచంద్రపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలం స్కూల్ గేమ్స్ రామచంద్రపురం కృత్తి వెంటి పేర్రాజు పంతులు హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్ -14 , అండర్-17 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు ఈ నెల 15వ తేదీ నుంచి జరుగుతాయని ఎంఇఒ టివి.రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15న బాలురకు 16 బాలికలకు ఎంపికలు జరుగుతాయన్నారు. మండల ఇన్‌ఛార్జి లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షెటిల్, అథ్లెటిక్స్‌లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. స్కూల్ గేమ్స్ నిర్వహణ నిమిత్తం జరిపిన సమావేశంలో ఎంఇఒ-2 వాసంశెట్టి నాగేశ్వర్, రామ చంద్రపురం మండల ప్రధాన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో కానరాని అభివృద్ధి

ప్రజా ప్రతినిధులు మారుతున్నా పరిష్కారం కాని సమస్యలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అభివృద్ధికి ఆమడదూరంలో లంక గ్రామాలు నిలిచాయి. జిల్లా విభిన్నమైన పి.గన్నవరం నియోజకవర్గం. మూడు వైపులా వైనతేయ, వశిష్ఠ, గౌతమి గోదావరి నది పాయలతో విస్తరించి ఉంది. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలతో పాటు మామిడికుదురు మండలంలో 11 గ్రామాలతో ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. ఓటరులు ఒక లక్షా 96 వేల 337 మంది ఉన్నారు వారిలో 98,969 మంది పురుషులు కాగా, 97363 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారం పై దృష్టి సారించని ప్రధాన పార్టీలు

ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న లంక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు లంక గ్రామాల్లో అధికంగా ఉండటంతో వ్యవసాయంపైనే జీవనం సాగిస్తుంటారు నదీ తీర ప్రాంతం విస్తారంగాఉంది కొబ్బరి సాగు ఎక్కువగా సాగవుతుంది కొబ్బరి ఉత్పత్తికి సంబంధించి అభివృద్ధి నిమిత్తం కొత్త వంగడాల పెంపకం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపరిశోధనకు ఉభయ రాష్ట్రాలకుగాను నియోజకవర్గంలో అంబాజీపేటలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఉంది. గత దశాబ్దం నుంచి వివిధ రకాల తెగుళ్లతో కొబ్బరి సాగు ఉత్పత్తులు తగ్గిపోతున్న కొత్త వంగడాల సాగుపై పరిశోధన పరిశోధనా కేంద్రం వైఫల్యం చెందినదని రైతులు విమర్శిస్తున్నారు. గంగాబొండం రకం సాగు కానరావడం లేదు. గంగా బొండాంరకాసాగుకు ప్రోత్సాహం అందిస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఈ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు ఈ కొత్త వంగడాలు ఈ ప్రాంతానికి దక్కకుండా ఇతర ప్రాంతాలకు మళ్లిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి



అప్పనపల్లిలో ఆగస్టు నెలలో వరదలతో కృతి మించిన నదీపోతం

వరదలకు భయం గుప్పెట్లో లంక గ్రామాలు

లంక గ్రామాలలో జులై,ఆగస్టు నెలలో వచ్చే వరదలతో తీర ప్రాంతాల ప్రజల గుండెల్లో ఆందోళన మొదలవుతోంది. గోదావరికి వరద వచ్చే రోజుల తరబడి వరద నీటిలోలంక గ్రామాలు నానుతుంటాయి. వరదల సమయంలో ఆయా గ్రామాలలో నీట మునిగిన ఇంట్లో సామగ్రి కోల్పోయే వారు కొందరైతే, పాడి, పంటలు కోల్పోయేవారు మరికొందరు. ఎన్నో ఇళ్లు నేలమట్టమవుతుంటాయి. నాయకులు వచ్చి పలకరించిపోతారే తప్ప సాయం, పంపిణీలపై దృష్టి సారించరు. లంక గ్రామాలకు బాహ్య ప్రపంచం తో సంబంధాలు తెగిపోతాయి. వరదల నుంచి శాశ్వత విముక్తికి అయినవిల్లి మం డలం తొగరపాయ దగ్గర ఎదురు బిడిమ్ వద్ద కాజువే, పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి దగ్గర కాజ్ వే, అప్పనపల్లి పాటురేవులో కాజ్‌వేలు నిర్మించాల్సి ఉంది. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడం తప్ప వాటిని పూర్తిచేసే వారే లేరు. ఇటువంటి ప్రధాన సమస్యలతో సతమతమవుతున్న లంక గ్రామాల ప్రజలు తమసమస్యల పట్టించుకోనే ప్రజాపతినిధి కోసం ఎదురుచూస్తున్నారు

ఇరిగేషన్ సదుపాయం కోసం ఎదురు చూపులు

దశాబ్దాల తరబడి లంక గ్రామాలు ఇరిగేషన్ సదుపాయానికి నోచుకోక కొబ్బరి తోటలకు సాగు నీటి తడులకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తే వాణిజ్య పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన పార్టీలు ఈ విషయాలపై దృష్టి సారించడం లేదు. మామిడికుదురు మండల పరిధిలో అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం, పెదపట్నం ఆదే విధంగా అంబాజీపేట మండల పరిధిలో వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాలు ఇరిగేషన్ సదుపాయంకు నోచుకోవడం లేదు

నదీ గర్భంలో కలిసిపోతున్న లంక గ్రామాలు

లంకగ్రామాలలో రైతుల సారవంతమైన భూములు, నివాస గృహాలు నదీగర్భంలో కలిసి పోతున్నాయి. వరదల సమయంలో మరింతగా కోత కృతిమించితోంది. నది కోత నివారణకు రివి ట్మెంట్లు, గ్రోయన్స్ నిర్మాణం గత దశాబ్దం నుంచి జరగడం లేదు. గత నెల ఆగస్టులో వచ్చిన వరదలతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, వాకలగరువు పల్లిపాలెం, పాశర్లపూడి తదితర ప్రాంతాలలో నదీ కోత శతిమించి సారవంతమైన భూములు నదీగర్భం లో కలిసిపోతున్నాయి

కానరాని పర్యాటకం

పర్యాటక ప్రాంత గుర్తింపుకు అవకాశాలున్న పర్యాటక శాఖ దృష్టి కానరావడం లేదు నియోజ కవర్గంలో ఆదుర్రు బౌద్ధ స్థూపం, కాటన్ హయం లో నిర్మించిన పి.గన్నవరం అక్విడక్ట్, అయినవిల్లి మండలంలో సకల విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయక ఆలయం, అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ దేవస్థానం, ఎల్.గన్నవరంలో అపర అన్నపూర్ణగా ప్రసిద్ధిగాంచిన డొక్కా సీతమ్మ నివాసం టూరిజం పర్యాటకంగా తీర్చిదిద్దే అవకాశాలు ఉన్నాయి. పాశర్లపూడి, ఆదుర్రులలో టూరిజం బోట్ పాయింట్లు ఏర్పాటు చేసిన అవి వినియోగంలో లేక నిరుపయోగంగా ఉన్నాయి. పర్యాటకుల దృష్టి ఆకర్షిస్తున్న బోట్ పాయింట్లను వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంత వాసులు విన్నవిస్తున్నారు అదిశగా అడుగులు పడటం లేదు.



ఆదుర్రులో నిరుపయోగంగా ఉన్న బోటు పాయింట్లు

రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి రేసులో అమూల్య?

- అనూహ్యంగా తెరపైకి మాజీ మంత్రి కుమార్తె
- ఐవిఆర్ఎస్ ద్వారా అమూల్యకే ప్రాధాన్యత
- మరో కొద్దిరోజుల్లో ఇన్‌ఛార్జి ఎంపిక

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. కొంతకాలంగా పార్టీలో చర్చ జరుగుతోంది. కొత్తగా నియోజకవర్గ పగ్గాలు ఎవరికి అప్పగిస్తారోనే సర్వత్రా ఆసక్తి నెలకొంది జరుగుతోంది. ఈ రేసులో నలుగురు పేర్లు ప్రముఖంగా వినిపి స్తున్నాయి. ఇన్‌ఛార్జి పదవికోసం ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన గెద్దం సింహా, నల్లి మోహన్, గేదెల వరలక్ష్మి, మోకా పార్వతి, బిసి సామాజిక వర్గం నుంచి చెల్లుబోయిన శ్రీనివాస్, డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, కాకి లక్ష్మణ మరి కొంత మంది నేతలు ప్రయత్నాల్లో ఉన్నారు. కొందరు నియోజకవర్గంలో పర్యటనలు కూడా మొదలు పెట్టారు. చంద్రబాబు కూడా కొద్ది రోజుల్లోనే ఇన్‌ఛార్జ్‌ను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టిడిపి నుంచి వైసిపికి మారిన తర్వాత నియోజకవర్గ బాధ్యతలను ఎవరికీ అప్పగించలేదు. దీంతో అందరూ ఇన్‌ఛార్జి పదవి కోసం పోటీ పడు తున్నారు. నియోజకవర్గం కేడర్ కూడా తమకు ఇన్ ఛార్జి కావాలని కోరుతున్నారు. వీరితో పాటు ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం కూడా పదవి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లో అమూల్య

ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవిఆర్ఎస్) ద్వారా రాజోలు టిడిపి ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్యకు ఇవ్వడంపై అభిప్రాయ సేకరణ జరిగింది. ఇందులో 70 శాతం అంగీకరించినట్లు రిపోర్ట్‌లో తేలింది. దీంతో ఆమెకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పార్టీ వర్గాల్లో



గొల్లపల్లి అమూల్య

వినికిడి. రాజోలు నియోజక వర్గం విషయంలో టిడిపి అధినేత చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గంలో పరిణామాలు, ఇతర సమీకరణలను బేరీజు వేసుకుని ఇన్‌ఛార్జిని ప్రకటిస్తారని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమారు ఆయిదు నెలల సమయం మాత్రమే ఉండటంతో త్వరగా ఇన్‌ఛార్జ్ ఎవరో తేల్చేయాలని నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు కూడా కోరుతున్నారు. మరి చంద్రబాబు ఎవరివైపు మొగ్గు చూపుతారోనే ఆసక్తికరంగా మారింది.

ఇన్‌ఛార్జి పదవి కోసం ఆశావాహుల పోటీ

స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడు తున్న వేళ పార్టీ ఇన్‌ఛార్జి పదవిని దక్కించు కునేందుకు రాజోలు నియోజకవర్గంలో ఆశావాహులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పదవిని భర్తీ చేసేందుకు పార్టీ అధిష్టానం పావులు కదుపుతోంది. అధిష్టానం నుంచి వచ్చే ఇన్‌ఛార్జి పదవి పేరుతో నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, భూపతి రాజు ఈశ్వరరాజు వర్మ, గెద్దం సింహా, మాజీ ఇన్‌ఛార్జి బత్తుల రాము, గేదెల వరలక్ష్మి, మోకా పార్వతి ఇన్‌ఛార్జి పదవి దక్కించుకోవడం కోసం అధిష్టానం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తెకు ఇన్‌ఛార్జి ఇస్తే ఎస్‌సి సామాజిక వర్గం నుంచి మహిళకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉంటుందని నియోజకవర్గ టిడిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

దసరా సందర్భంగా ఆటో కార్మికులకు ఇస్మానన్న రూ.15వేలు కాకుండా రెండ్లేకు కలిపి రూ.30వేలు ఇవ్వాలని, 50 ఏళ్ల వయసు దాటిన ఆటో కార్మికులకు ప్రతినెల పెన్షన్ ఇవ్వాలని, ఆటోలకు సంబంధించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఆంధ్ర ఆటోవాల వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావుకు సమస్యలతో



నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఉటాల వెంకటేష్, మోకా శ్రీను, బోలిశెట్టి శంకర్, బి.నాని, రాయుడు ప్రసాద్, బొమ్మి ఫణి, నెల్లి వెంకటేశ్వరరావు, వాసర్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడితే రూ.5వేల జరిమానా

ప్రజాశక్తి - మండపేట


పట్టణంలో విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కడితే రూ.5వేల జరిమానా విధిస్తామని మండపేట మున్సిపల్ కమిషనర్ టివి.రంగారావు అన్నారు. మండపేటలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టడం కారణంగా విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇకపై విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు ఎవరు కట్టినా, ఫ్లెక్సీలో ఉన్న వారిపైనా, వాటిని కట్టిన సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

పలువురికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొత్తూరులో గల టిడ్కో గృహ సముదాయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మారెళ్ళ మహేంద్ర నాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎల్‌వి.ప్రసాద్ ఉచిత కంటి వైద్యులు దీనిని ఏర్పాటు చేశారు. డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ కొండలరావు గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కొంతమంది రోగులను అధిక స్థాయి వైద్య సేవల కోసం ఎల్. ప్రసాద్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నిర్వాహకులు మారెళ్ల రజనీ మాట్లాడుతూ తన కుమారుడు మహేంద్ర నాయుడు సాధారణ ప్రజల కోసం చూపిన సేవాస్ఫూర్తి గుర్తుగా, ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, మహేంద్ర నాయుడు స్నేహితులు రామ్, సురేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కారెం వెంకటేశ్వరరావు, నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక గొల్లగూడెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి సీతారాం చిత్రపటానికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం మరణించి సంవత్సరకాలం అయ్యిందని దేశ రాజకీయ రంగంలో ఆయనలేని వెలితి స్పష్టంగా కన్పిస్తున్నదని అన్నారు. భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమాన త్వం, సోషలిజంలపై ఆరెస్సెస్ దాని పనుపున నడుస్తున్న బిజెపి కేంద్ర సర్కారు తీవ్రమైన దాడి చేస్తున్న తరుణంలో, దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యపర్చి ముందుకు తీసుకుపోవడంలో సీతారాం ఏచూరి తీవ్రమైన కషి చేశారని అన్నారు.ఆయన మన మధ్య లేకపోయినా ఆ ఒరవడిని మరింత పటిష్టంగా ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన చూపిన బాటలో మనం పయనించాలని ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న బిజెపి మతో న్మాద ప్రమాదాన్ని ప్రజలందరూ ఐక్యంగా ముక్తకంఠంతో ఎదిరించాలని అన్నారు. అప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు దళిత సంఘాల నాయకులు గల్లా రాజేంద్ర, ప్రజాసంఘాల నాయకులు కె.శంకర్, సురేష్ ,భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** ప్రజా ఉద్యమాలకు దారి దీపం సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్ల గేటు సెంటర్ లోని సిపిఎం కార్యాలయం ఆవరణలో పార్టీ సీనియర్ నాయకుడు సఖిలే సూర్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాప్రసాద్ తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు హెచ్చు మీరుతున్న సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీ లేని పోరాటం చేసిన పోరాట యోధుడు ఏచూరి అని కొనియాడారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతు, సమసమాజ నిర్మాణానికి తుది శ్వాస వరకు పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరారన్నారు. తదుపరి సిపిఎం సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా చేరి, అంచెలంచెలుగా ఎదిగి సుమారు ఐదు దశాబ్దాల పాటు శ్రామిక, కార్మిక, కర్షక వర్గాల పక్షాన పోరాడిన ఏచూరి రచయితగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశానికి, ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాము బాలయ్య, దొమ్మేటి వీర రాఘవులు, కె.లక్ష్మణరావు, విత్తనాల ఏడుకొండలు, గోవిందు, వీర్రాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి వర్ధంతి

ఆర్‌టిసి ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - అమలాపురం

విద్యుత్ బస్సుల పాలసీ పేరుతో ఆర్‌టిసిలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అమలాపురం డిపో నందు యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. అఖిల భారత ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు సేవ్ ఆర్‌టిసిడేలో భాగంగా శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా విద్యుత్ బస్సుల పాలసీ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రాలకు కేటాయిస్తూ, అందులో విధివిధానాలుగా ప్రభుత్వరంగ సంస్థలైన ఆర్‌టిలతో సంబంధం లేకుండా ప్రయివేటు కన్సల్టియంలతో బస్సులు నిర్వహించాలని, బస్సులలో సిబ్బందిని కూడా ప్రయివేటు వారే నియ మించుకోవచ్చని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు మొత్తం నేరుగా ఆ ప్రయివేటు సంస్థలకి చెందే విధంగా ప్రకటించారని అన్నారు. దీనివల్ల ప్రభుత్వం రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న 58 ఆర్‌టిసిలు త్వరలోనే మూతపడే అవకాశం ఉందని అన్నారు. వ్యాపార దృక్పథంతో పనిచేసే ప్రయివేటు కన్సల్టియంలు కార్మికుల కు సరైన జీతాలు ఇవ్వకుండా, ప్రజల వద్ద నుంచి టిక్కెట్ల రూపంలో భారీగా వసూళ్లు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉంది. యూనియన్ జిల్లా కార్యదర్శి,



అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

వంక గణపతి మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ ఆర్టీసీలకు మరణ శాసనంగా ఉన్న జిఒ 88 ను రద్దు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ రంగ ఆర్‌టిసి సంస్థల ద్వారానే నిర్వహించాలన్నారు. సంబంధిత సబ్సిడీలను ఆర్‌టిసికె కేటాయించాలని, రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు(స్త్రీ శక్తి పథకం) అమలు నిమిత్తం సరిపడా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. డ్రైవర్ కండక్టర్లను వెంటనే రిక్రూట్మెంట్ చేయాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని కోరారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుకూలంగా ఈ ప్రభుత్వాలు పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ గేట్ మీటింగ్ నందు కె.భీమేశ్వరరావు, కెవి.రావు, కోటేశ్వరరావు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కాలర్‌షిప్ పరీక్ష కొరకు సైన్స్ విభాగంలో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు కె.శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. రేవతి సైన్స్ సెంటర్ నందు కోచింగ్ నిర్వహిస్తున్నామని ఆసక్తి గల విద్యార్థులు తమ పేరు ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. తరగతులు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 98661 30320 నెంబర్ సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఈలి శ్రీనివాసరావు, నగరం ఛైర్మన్



అప్పన వీరబాబు, పాశర్లపూడిలంక ఛైర్మన్



మందా గాంధీ, పాశర్లపూడి, ఛైర్మన్

సొసైటీలకు త్రీమెన్ కమిటీల నియామకం

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు మండల పరిధిలో మూడు సొసైటీలకు త్రీ మెన్ కమిటీలను నియమిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా టిడిపికి చెందిన ఈలి శ్రీనివాసరావు, సభ్యులుగా కాకి వాసు, మట్టా సత్తిబాబు శుక్రవారం మామిడి కుదురు సొసైటీ కార్యాలయములో బాధ్యతలు స్వీకరించారు. పాశర్లపూడి పిఎసిఎస్ ఛైర్మన్‌గా జనసేన నాయకులు మందా గాంధీ, సభ్యులుగా యర్రంశెట్టి దుర్గా రాజేశ్వరి, బొంతు మహాలక్ష్మి నాగ కుమారి, పాశర్లపూడిలంక ఛైర్మన్‌గా జనసేన నాయకులు అప్పన వీరబాబు, సభ్యులుగా ఇంజేటి నాగేశ్వరరావు, కుడిపూడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

భవిత సెంటర్ సందర్శన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక భవిత సెంటర్‌ను సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం శుక్రవారం సందర్శించి పిల్లల నైపుణ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ విద్యాబోధనను పరిశీలించి భవిత ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. భవిత ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానం, వారి పనితీరులపై సంతృప్తి చెంది భవిత సిబ్బందిని ప్రశంసించారు. భవిత కేంద్రంలో విద్యార్థుల హాజరు పట్టి, వివిధ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు మోర్తా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హెచ్ఎం వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం ప్రధానోపాధ్యాయులు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయనకు శుక్రవారం ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు, జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఒత్తిడి రహిత విద్యావిధానం ద్వారానే విద్యార్థులలో సృజనాత్మకత, జ్ఞాన వికాసం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా కృషి చేసి ఉత్తమ ఫలితాలను సాధించిన వెంకటేశ్వరరావు కృషి అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి, పాఠశాల యొక్క సర్వతోముఖాభివృద్ధి కోసం తన సేవలను అంకితభావంతో సమర్పించిన ఆయన దక్పథం ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు. విద్యా రంగం అభివద్ధి ఒక సమూహ కృషి ఫలితమని, అందులో ప్రతి ఒక్కరి సహకారాన్ని సమన్వయం చేసు కుంటూ, పాఠశాలను మోడల్‌గా నిలబెట్టిన వెంకటేశ్వరరావు నాయకత్వం విశేషమని కొని యాడారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ భవానికి వినతి పత్రం అందజేసిన మండల సచివాలయ ఉద్యోగులు

డోర్ టు డోర్ సర్వేను వ్యతిరేకిస్తున్న ఐక్యవేదిక

ప్రజాశక్తి - మామిడికుదురు

డోర్ టు డోర్ సర్వేకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఐక్యవేదిక పూర్తిగా వ్యతిరేకిస్తుందని సభ్యులు అన్నారు. సమయపాలన లేని వీడియో కాన్ఫరెన్స్‌ల నుంచి విముక్తి కలిగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్ కేడర్ కు మార్చాలని, ఇతరత్రా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం మధ్యాహ్న భోజన విరామంలో ఎంపిడిఒ భవానికి సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక సభ్యులు అందజేశారు. సచివాలయంలోనే వాట్సాప్ సేవలను పెంచేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. పరిష్కారం కోసం ప్రభుత్వము చర్యలు తీసుకోవాలన్నారు.

ముక్తేశ్వరంలో మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - అయినవిల్లి

ముక్తేశ్వరం జడ్పి ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత, ప్రాథమి కోన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిక్రీడా పోటీలు ఈ నెల 17 నుంచి నిర్వహిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథెలెటిక్స్‌లో ఈనెల17న బాలురకు, ఈనెల 18న బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తారన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ఐ.పోలవరంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శుక్రవారం కొనసాగింది. ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బాలయోగిపేటలోని 13వ రేషన్ షాపు వద్ద శుక్రవారం జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్ర మానికి ఎంఎల్ఎ సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అంద జేశారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులను సకాలంలో అందిం చడమే కాకుండా, ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే బహుళ సంక్షేమ పథకా లను, ఈ కార్డుల ద్వారా పొందే సౌలభ్యం ఉందని వివరించారు. మండల, నగర పంచాయతీ వ్యాప్తంగా ఉన్న 49 రేషన్ షాపుల పరిధిలోని 21586 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీచేశామని తహాశీల్దార్ టి.సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు,తాడి నరసింహారావు,దొమ్మేటి రమణ కుమార్, పొద్దోకు నారాయణ రావు, పిల్లి నాగరాజు, ఆర్ఐ మదనమోహన్, విఆర్ఒ వెంకట్రావ్, రేషన్ షాపు డీలర్ కటికిదల నాని తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మండలంలో శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాట్రేనికోన మండలంలో 23,549 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ సుబ్బలక్ష్మి, ఎంఎస్ఓ బి ప్రసన్న జ్యోతి, ఎంపిడిఒ వెంకటాచలం, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలో పలుచోట్ల స్మార్ట్ రేషన్ కార్డులు శుక్రవారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. జి.వేమవరం, కొమరగిరి, టి.కొత్తపల్లి పలుచోట్ల ప్రజా ప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేశారు. తహాశీల్దార్ విజయ శ్రీ మాట్లాడుతూ మండలంలో 21,343 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లివివేకానంద, రాయపురెడ్డి నీల కంఠే శ్వరరావు, కాకర్లపూడి బుజ్జి, గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి స్వామినాయుడు, చిక్కాల శ్రీనివాస్, పెంటా రవి ప్రసాద్, మద్దింశెట్టి పురుషోత్తం, చోడిశెట్టి నాగబాబు,తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ కార్డులతో ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు.



అంగరలో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

కపిలేశ్వరపురం మండలం అంగరలో తహాశీల్దార్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కపిలేశ్వరపురం మండలంలో 21,511 స్మార్ట్ కార్డులు, పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వేలి ముద్రలు వేసి ఈ స్మార్ట్ కార్డును పొందాలన్నారు. కులాలు పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మండపేట నియోజకవర్గం లో ఎవరికైనా రేషన్ కార్డు సమస్యలు ఉంటే పౌర సరఫరాల అధికారిణి పద్మ (9849249283)కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎండిఒ జి.రాజేంద్రప్రసాద్, ఇఒ పిఆర్‌డి మోహన్, ఆర్ఐ అజ్జమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ పుచ్చల శ్రీనివాస్, గుడాల జయబాబు, ముత్యాల వెంకటరావు, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

గామన్ బ్రిడ్జిపై ఈనెల 7న సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం రాత్రి మతి చెందినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఏడో తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన ఆతన్ని హైవే పోలీసులు కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు సిఐ తెలిపారు. మృతునికి సంబంధించిన ఎలాంటి ఆచూకీ దొరకలేదన్నారు. మృతుని వయసు 60 నుంచి 65 ఏళ్లు ఉంటుందన్నారు వివరాలు తెలిసినవారు 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాలికను మోసగించిన యువకునిపై కేసు

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలికను ప్రేమపేరుతో నమ్మించి వంచించిన దాసరి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామని సిఐ పి.విశ్వం తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. వివాహం చేసుకోమని అడిగితే తమను కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితునిపై పోక్సో కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం తాళ్లూరులో జాతీయ రహదారిపై హనీ దాబా వద్ద ఈ నెల 10న సుమారు 600 గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు గండేపల్లి ఎస్ఐ శివనాగ బాబు తెలిపారు. నెల్లూరుకు చెందిన అయ్యారి మునిరాజా నెల్లూరు గోల్డ్ జువెలరీ షాపులో పని చేస్తున్నారు. ఆయన తరచూ విజయనగరం, విశాఖపట్నంలో గోల్డ్ షాపులకు బంగారు వస్తువులు పట్టుకెళ్లి విక్రయిస్తుంటారు. రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి 1200 గ్రాముల బంగారు వస్తువులు పట్టుకొని వచ్చి విజయనగరం వైజాగ్‌లో 600 గ్రాముల గోల్డ్ వస్తువులు షాపులకు ఇచ్చారు. మిగిలిన 600 గ్రాముల గోల్డ్ వస్తువులతో 10న నెల్లూరు వస్తుండగా తాళ్లూరు హనీ దాబా వద్దకు భోజనం నిమిత్తం ఆగారు. అనంతరం తిరిగి చూసేసరికి బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి-గండేపల్లి, జగ్గంపేట

గండేపల్లి, జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల పేకాట శిబిరాలపై శుక్రవారం గండేపల్లి, జగ్గంపేట ఎస్ఐలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న 34 మందిని అరెస్టు చేసి పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టినట్లు సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు.

కుమారుడు సహా తల్లి అదృశ్యం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలో మూడేళ్ల కుమారునితో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన దుర్గాడలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నక్కా సింహాచలం మూడేళ్ల కుమారుడు నక్కా చైతన్యతో కలిసి ఎవరికీ చెప్పకుండా బుధవారం 10 గంటల సమయంలో ఇంటి నుండి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. వారి కోసం బంధువుల ఇళ్లు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో సింహాచలం మేనమామ శివకోటి నూకరాజు ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఫైలేరియాపై సర్వే

ప్రజాశక్తి-కడియం

లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధివ్యాప్తక అంచనా సర్వే పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు కడియం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.మణి జ్యోత్స్న తెలిపారు. మండలంలోని వేమగిరితోట, మాధవరాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలలను ఎంపికచేసి ఒకటి రెండు తరగతుల్లో 17 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా సహాయ మలేరియా అధికారి పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీహరి, ల్యాబ్ టెక్నీషియన్ జె.జగదీష్ శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. కార్య క్రమంలో వైద్య సిబ్బంది పి.మురళీకృష్ణ, ఎం.మా ధురి, జి.రాము, సిహెచ్.మణిదీప్తి, వి.ఉమ, అరుణ మహాలక్ష్మి, ముత్యాలు పలువురు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఖండవల్లిలో గ్రామసభ


ప్రజాశక్తి - పెరవలి

మండలంలో ఖండవల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం డిఎల్ఆర్ గ్రామసభను తహశీల్దార్ కె.నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదు నెలలుగా గ్రామంలో 11 బృందాలు క్షేత్రస్థాయిలో రీ సర్వే చేసి శుక్రవారం ఫైనల్ గ్రామసభ నిర్వహిస్తామన్నారు. ఈలోగా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని రైతులు భూ యజమానులే డాక్యుమెంట్స్ జిరాక్స్‌తో సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు సొసైటీ అధ్యక్షులు భూపతిరాజు రవివర్మ, ఉప సర్పంచ్ అతికాల శ్రీను డిప్యూటీ తాసిల్దార్ సన్నీ బాబు పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూతన అంబులెన్సు ప్రారంభం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతన అంబులెన్సును ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు జెండా ఊపి ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలకు అత్యవసర సేవలు అందించే విషయంలో అంబులెన్స్ పాత్ర కీలకమన్నారు. దేవరపల్లి జాతీయ రహదారికి అలాగే చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలకు నూతన అంబులెన్స్ రావడం ద్వారా ఎంతో ఉపయోగకరమన్నారు. త్వరలో నల్లజర్లకు కూడా నూతన అంబులెన్సు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, నాయకులు గన్నమని కృష్ణ, కొయ్యలమూడి సుధారాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



స్మార్ట్ రేషన్ కార్డుల్లో మారని జిల్లా పేరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా పేరు మారినా జిల్లా అధికారుల తీరు మారలేదని స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మరోసారి రుజువైంది. మూడేళ్ల క్రితం ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాగా రూపాంతరం చెందింది. జిల్లా కార్యకలాపాలు అన్ని జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురం, ముమ్మిడివరంలో కొనసాగుతున్నాయి. అయితే అధికారుల నిర్లక్ష్య వైఖరి మాత్రం యాథావిధిగానే కొనసాగుతోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణలో అనేక లోపాలు తలెత్తాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలంలోని పలు గ్రామాల్లో పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల్లో జిల్లా పేరు ఇంకా 'తూర్పు గోదావరి'గానే ముద్రణ జరిగింది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు తదితరులు

వన్నెచింతలపూడిలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వన్నెచింతలపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల నందు ఇటీవల జరిగిన సాధారణ బదిలీపై వెళ్లిన కామన గణేశ్వరరావు (పిడి), పిఎస్ మాస్టార్, పి.శ్రీ ప్రకాష్, తెలుగు భాష ఉపాధ్యాయురాలు వై.సత్య జ్యోతి, అలాగే ఈ పాఠశాలకు ఎల్లవేళలా సహకరించే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరమట విష్ణు ప్రసాద్‌లను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పాఠశాలకు బదిలీపై వచ్చిన అడబాల శ్రీనివాస్, పీడీ పడుచూరి విఘ్నేశ్వరుడు, తెలుగు భాష ఉపాధ్యాయులు మామిడి శెట్టి శ్రీనివాసరావులను కూడా ఘనంగా సన్మానించారు. పాఠశాల ఛైర్మన్ ఎలిపే ముత్యాల బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.




సంతాప సభలో మాట్లాడుతున్న కనికిరెడ్డి

కళాశాలల మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కళాశాలల ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్‌వి.సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో కనికిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత చదువులకు సాయం చేసిన ఎస్‌వి.సూర్యనారాయణ రెడ్డి గురువారం హఠాన్మరణం పొందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ లెక్చరర్ జివి.రమణ, కళాశాల లైబ్రరీయన్ టి.రాకేష్, లెక్చరర్లు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మణికంఠను అభినందిస్తున్న జొన్నాడ టిడిపి నేతలు

కానిస్టేబుల్‌గా ఎంపికైన మణికంఠకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడకి చెందిన నాగిరెడ్డి గణపతి, సత్యవతి దంపతుల కుమారుడు నాగిరెడ్డి వీర మణికంఠ స్వామి ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. దీంతో శుక్రవారం స్థానిక టిడిపి నేతలు తాడి శ్రీనివాస రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ సొసైటీ అధ్యక్షుడు మేడపాటి రామారెడ్డిల ఆధ్వర్యంలో మణికంఠ స్వామిని అభినందించి ఘనంగా సత్కరించారు. అలాగే మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గుత్తుల పవన్, భావన శ్రీను, ద్వారంపూడి సతీష్ రెడ్డి, నాగిరెడ్డి శ్రీను, సత్తి శ్రీనివాసరెడ్డి, పడాల శివారెడ్డి, సుంకర రాజేష్, నాగిరెడ్డి ఆదియ్య, పటెం వీరబాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి వెన్నెముక

కాజులూరు : ఉపాధ్యాయులే సమాజానికి వెన్నెముకగా నిలుస్తారని తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారంఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. నక్కా వెంకటలక్ష్మి, పేరి ఉమాకాంత్, ప్రభాకర్, కె.కృష్ణ, సిహెచ్.కనకదుర్గ, జి.శ్రీనివాస్, పి.సత్యనారాయణను సత్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు వి.భానుప్రకాష్, శివ ప్రసాద్, రవీంద్ర, రామకృష్ణ, ఎంఇఇలు డేవిడ్, జాన్, ఎంపిడిఒ రాంబాబు పాల్గొన్నారు.

సమన్వయంతో దసరా ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక పట్టణంలో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన దసరా ఉత్సవా లుగా ప్రసిద్ధిగాంచినవని, ఈ ఉత్సవాలను అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా డివిజన్ స్థాయి పోలీసు అధికారులు మున్సిపల్ కమిషనర్లు దేవాదాయశాఖ అధికారులు ఉత్సవ కమిటీ పెద్దలతో సమావేశం నిర్వ హించి దసరా ఉత్సవాల నిర్వహణ సన్నద్ధత అం శాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు ఏర్పాటు చర్యలపై ఈనెల 26న మరలా పూర్తిస్థాయి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వ హిస్తామన్నారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ కమిషనర్లు ఈ ఏడు వీధులలో విద్యుత్తు కేబుల్ వైర్లు ఊరే గింపులకు అడ్డంకి లేకుండా చూడాలన్నారు. ఎస్‌పి బి.కృష్ణారావు మాట్లాడుతూ ఏడు వీధుల ప్రదర్శనలకు సంబంధించి క్రమ పద్ధతిలో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేని విధంగా పూర్వపు సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ నిర్వహించేలా పోలీస్ శాఖ సహకారం అందిస్తుందని శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిగా తోడ్పాటును అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.మాధవి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, డి.అఖిల, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సత్యనారాయణ జిల్లా స్థాయి అధికారులు డిఎస్‌పిలు పాల్గొన్నారు.

వేలివెన్నులో ఎలుకల మందు పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సామూహికంగా ఎలుకలను నిర్మూలిస్తేనే పంటకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వేలివెన్నులో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ అధ్యక్షతన ఎలుకల నివారణా మందు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వరి పైరులో 15 నుంచి 20 శాతం వరకు దిగుబడి ఎలుకల వల్ల తగ్గుతుందన్నారు. ఇందుకోసం సామూహిక ఎలుకల నివారణను పాటించాలన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హైస్కూలుకు బీరువాల బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రు హైస్కూల్‌కు 1981-1985 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.60వేలు విలువైన రెండు బీరువాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు గాడేపల్లి నాగప్రసాద్‌కు అందజేశారు. హై స్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంతో సహకరిస్తున్నారని వారి సేవలను హెచ్ఎం అభినందిం చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, గోకవరపు వెంకన్న బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో కానూరు, నడిపల్లి గ్రామాల పాడి పశువులకు శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధి శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ భావనమధుపూర్ణచంద్ ప్రారంభించారు ఈ సందర్భంగా వెటర్నరీ ఎడి డాక్టర్ రిషిప్రసాద్ మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో పాడి రైతులు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలోనడిపల్లి సర్పంచ్ బీర సత్యవేణిరాజు, సొసైటీ అధ్యక్షులు వాకలపూడి వీర్రాజు, ఎంపిటిసి సభ్యులు కోలా సీతయ్యనాయుడు, ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, పశు వైద్యాధికారులు డాక్టర్ వానపల్లి చరణ్‌ఫణీంద్ర, డాక్టర్ సల్మా, వెటర్నరీ అసిస్టెంట్లు పాడి రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు పిహెచ్‌సి వైద్యులు పి.తేజశ్రీ, కె.హేమరాజు ఆధ్వర్యంలో స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెం-1 సచివా లయం పరిధిలోని జడ్‌పి పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమ ంలో సర్పంచ్ భావన మధుపూర్ణచంద్, సిహెచ్ఒ కె.జయమణి, ఎంపిహెచ్ఒ ఎం.రాజ మో హన్, సూపర్‌వైజర్ కెవి.నాగేశ్వరావు, హెచ్ఎం టిఎస్.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్య భాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాజ్య భాషా (హిందీ భాషా) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగలోని 8వ షెడ్యూల్‌లో హిందీ భాషను అధికారిక భాషగా పొందుపరిచారన్నారు. ప్రపంచంలో ఆంగ్లం తరువాత ఎక్కువమంది మాట్లాడే భాష హిందీ అన్నారు. హిందీ ఉపాధ్యాయిని ఎం.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడం చాలా సులభమని, స్వాతంత్ర్య పోరాట సమయంలో భారతదేశాన్ని ఏకతాటి పైకి తెచ్చింది హిందీ భాషేనన్నారు. ఉపాధ్యాయుడు బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర వాలంటీర్లకు శిక్షణ

తాళ్లపూడి : అక్షర ఆంధ్ర వాలంటీర్లకు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఎన్ఆర్‌జిఎస్‌లో పనులు చేస్తున్న 110 మంది నిరక్షరాస్యులను, మహిళా గ్రూపుల్లో రెండు వందల మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. పది మంది నిరక్షరాస్యలకు అక్షరాలు నేర్పేందుకు ఒక్కొక్క వాలంటీర్‌ను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రమాదేవి, ఎంఇఒ-2 నెహ్రూ, ఎపిఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పనితీరు ఆధారంగానే పార్టీ పదవులు

ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ప్రజాశక్తి - కాట్రేనికోన

టిడిపి అభ్యున్నతికి కషి వారి పనితీరు ఆధారంగానే పార్టీ పదవులు లభిస్తాయని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తొలుత కాట్రేనికోనలో నూతనముగా నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు భూమి పూజ చేసిన అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కషి ఫలితంగా తాను రెండుసార్లు ఎంఎల్ఎగా ఎన్నికయ్యాను అన్నారు నిస్వార్థంగా పనిచేసే ప్రతి ఒక్కరికి పదవులు లభిస్తాయని ఆయన గుర్తు చేశారు. అలాగే వివిధ స్థాయిలో వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు. గతంలో పనిచేసిన మండల కమిటీ అద్భుతంగా పని చేసిందన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన ప్రస్తుత కమిటీ అదే తరహాలో పని చేయాలని సూచించారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మండల టిడిపి అధ్యక్షులుగా చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఇసుకపల్లి శివశంకర్లలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడుంపల్లి సుబ్బరాజు, విత్తనాల నాగ శ్రీనివాసరావు, ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, చొటపల్లి నాగు, దంతులూరి సీతారామకష్ణంరాజు, ఆకాశం శ్రీనివాస్, వాసంశెట్టి రాజేశ్వరరావు, నీటి సంఘ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పెట్టా అంబేద్కర్

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో నడవడమే కాకుండా ఒక న్యాయవాదిగా సేవలు అందించిన మహోన్నత వ్యక్తి పెట్టా అంబేద్కర్ అని సీనియర్ న్యాయవాది ఐఎన్.మల్లేశ్వరరావు అన్నారు. కీర్తిశేషులు న్యాయవాది అంబేద్కర్‌వాది పెట్టా అంబేద్కర్ మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం గోసంగి బంగార్రాజు అధ్యక్షతన స్థానిక త్రి రత్న బుద్ధవిహార్ నందు శుక్రవారం నిర్వహించారు. ఐఎన్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ పెట్టా అంబేద్కర్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని ఆయనను ప్రతీ ఒక్కరూ ఆదర్శం తీసుకుని నడవాలని గుర్తు చేశారు. అదేవిధంగా ఆయన పేరుతో విద్యార్థులకు అవార్డుల ప్రదానంచేయడం సంతోషదాయకమని అన్నారు. అనంతరం ఇసుకపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థిని ఉందుర్తి ఈశ్వరికి పెట్టా అంబేద్కర్ మెమోరియల్ అవార్డు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పరమట రాంప్రసాద్, జల్లి శ్రీనివాసరావు, కాశీ వెంకట్రావు, ఉండ్రు బాబ్జి, బివివి.సత్యనారాయణ, కోడూరి రామమూర్తి, ధోనిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగమోహన్‌రెడ్డికి ప్రముఖుల అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడకి చెందిన నాంద్ర నాగమోహన్‌రెడ్డి రాష్ట్ర వైసిసి గ్రీవెన్స్ సెల్ విభాగం సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్‌ను, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, రాంబాబులను వారి నివాసాల వద్ద శు క్రవారం నాగమోహన్‌రెడ్డి కలిశారు. దీంతో ముందుగా చెముడులంకలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాగమోహన్‌రెడ్డిని, అనంతరం చొప్పెల్లలో ఎంపిపి, జడ్‌పిటిసి సభ్యులు ఆధ్వర్యంలో అభి నందన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో యనమదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో రాజంపాలెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గోపాలపురం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దూబచర్ల డైట్‌లో జరిగిన కళా ఉత్సవ్-2025లో రాజంపాలెం జడ్‌పిహెచ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సింగింగ్ కేటగిరిలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం మడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు ముప్పిడి జాస్మిన్, సొంగ శిరీష, కొరపాటి శ్రీజ, దూబచర్లలో నిర్వహించిన కళ ఉత్సవ్‌లో పాల్గొన్నారనానరు. ఫోక్‌డ్యాన్స్‌లో వార ప్రసన్న, కొత్తపల్లి శ్రీవల్లి, కప్పల పూజిత, పి.సంధ్య మూడో స్థానంలో నిలిచారన్నారు. డ్రామా విభాగంలో దాసరి ఈశ్వర్, వేములూరి గోపీచంద్, ప్రత్యూష, జి యల్ వి మనోహర్, జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరికి గైడ్ టీచర్‌గా డి.శేషారత్నం, మద్దాల నాగేశ్వరరావు వ్యవహరించారు. ఉపాధ్యా యులు తాతారావు, ఎం నాగమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలకు హాజరైనట్లు తెలిపారు. వీరిని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, డివైఇఒ ఎం,రామన్న దొర అభినందించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పిదాలు సవరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఉన్న తప్పిదాలను తక్షణమే సవరించాలని మాలమహానాడు డిమాండ్ చేసింది. తహశీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో అంబేద్కర్ పేరును ప్రస్తావించకుండా కేవలం కోనసీమ జిల్లా అని ప్రచురించడం బాధాకరమని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే అధికారులు స్పం దించాలన్నారు. ప్రతి కార్డులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అని ముద్రించేలా అధి కారు లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రంఅందజేసిన వారిలో బొంతు చందు, గెడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతి పురోగతి సూచికపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి కెవికె.దుర్గారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, వాటి అమలు విధానాలు, గ్రామ స్థాయి అత్యున్నత అభివృద్ధి లక్ష్యాల సాధనకు తగిన ప్రణాళికల రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంపిపి దుర్గారావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ఈ శిక్షణ ఉపయోగపడు తుంద న్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

210 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

గ్రామీణ ప్రజలకు అవసరమైన ఖరీదైన వైద్య సేవలు తమ ఆసుపత్రి లో ఉచితంగా అందజేస్తున్నామని తాళ్లపూడిలోనే శ్రీ సాయి స్ఫూర్తి ఆసుపత్రి సిఇఒ గూడా విజయరాజు తెలిపారు. సాయి స్ఫూర్తి వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం ఆసుపత్రిలో 210 మందికి ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ ద్వా రా ఆపరేషన్లు చేస్తామన్నారు. వైద్య పరీక్షలను సిఇఒ తదితరులు పర్యవేక్షించారు.